# బాదంచెట్టు - తంబురా పెట్టె

రెప రెపలాడింది యెలక్ట్రీ దీపం. స్పందనాస్పదమైన ప్రాణం దాని నాడిలో గిలగిల తన్నుకుంది.

గది నిశ్శబ్దంగా వుంది. నిష్క్రమించబోయే ప్రాణం యెలక్ట్రీ దీపంలాగే గిజ గిజ మంటుంది. తరువాత అంతా చీకటి! చీకటిలో నిశ్శబ్దం!

ఆమె కళ్ళు మూసుకుంది.

'బాధగా వుందా' భర్త నిమ్మళంగా అడిగాడు. ఆమె లేదన్నట్లు కళ్ళతోనే చెప్పింది.

మేడ మీద విశాలంగా నీటైన గది. మంచం. పరుపుమీద పాల నురుగులా తెల్లటి దుప్పటి, దిండ్లు. ఆమె తల దిండులోకి కాస్త దిగబడింది ఆమె శరీర వర్ణం, ధరించిన చీర కూడా తెల్లని తెలుపు.

ఎడం పక్క కిటికీలోంచి పెరట్లో బాదంచెట్టు అగుపిస్తోంది. పెరట్లో చాలా పూల మొక్కలూ, పాదులూ వున్నాయి.

అత్తగారు నిండు విగ్రహం. లక్ష్మీదేవిలా వుంటుంది. అడ్డ బాస, గోచీకట్టుతో ఆమెకి మొక్కలూ, పాదులూ పెంపకం అంటే సరదా.

మామగారు బ్యాంకి యేజంటుగా పనిచేసి, ధర్మరాజులాంటివాడు, నికార్సయిన మనిషి అని పేరు పొంది రిటైరయేరు. పండు తమలపాకులా వుంటారు.

పెద్ద మరదలికి పూలూ, పాదులు కూడా యిష్టమే. చిన్న మరదలికవేవీ కిట్టవు. ఆమె దంతా 'సింపులు' పద్ధతి.

బావగారు డాక్టరు. ఆయన భార్య కూడా డాక్టరే. వాళ్లిద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకుని, తన పెళ్లి కాకముందే 'స్టేట్సుకి' వెళిపోయేరట.

పెద్దమరిది వృక్షశాస్త్రం చదువుతున్నాడు. అతనికి చెట్లు, ఆకులు, పువ్వులు, వేళ్లు డాక్టరుకి రోగుల్లా కనిపిస్తాయి. అన్నిటినీ పరీక్షగా చూస్తాడు. వాటిని ముందు కుటుంబాల వారీగా విభజిస్తాడు, ప్రతిదానికీ పైసాచిక భాషలాంటి పేరు పెడతాడు. చిన్నమరిది ఆర్థికశాస్త్రం చదువుతున్నాడు.

పెదమామగారు ఋషిలాంటివాడు. అంటే ఆయనకు గడ్డం వుంది. భార్య వుంది. పిల్లలులేరు. చదువూలేదు, కాని భూముల వ్యవహారాలన్నీ ఆయనే చూసుకుంటాడు, ఆయనకు 'అలోపతి' వైద్యంమీద వీసంనమ్మకం లేదు. 'హోమియో' వైద్యమే శ్రేష్టం అంటాడు. ద్వాదశ లవణ చికిత్స పిలుస్తే పలుకుతుందంటాడు. పిల్లలకి మంచిదంటాడు. అతనికి పిల్లలు లేరు మరి! పొలం నుంచి వచ్చేవాళ్ళకి చక్కెర గుళ్లు యిస్తాడు.

మామగారికి ప్రతిరోజూ 'ఎనీమా' వుండాలి. మరదళ్ళకి నెత్తురు కోసమో, నెత్తురెక్కువగా పోతూందనో నిత్యం కోర్సుల మీద కోర్సులు ఇంజక్షనులుండాలి.

అత్తగారికి మాత్రం ఆయుర్వేదం తప్పించి మరో వైద్యం మీద నమ్మకం లేదు. పోతే, బైరాగి చిటికెలమీదా నమ్మకం వుంది. అవి ప్రయోగించి యింట్లో ఒకరిద్దరు పిల్లల్ని పరలోకానికి పంపింది.

ప్లాటుఫారం మీద రైళ్ళు వస్తూ పోతున్నట్టు నిత్యం వాళ్ళింటికి బంధు మిత్రులొస్తూ పోతుంటారు. ఏలూరు మావయ్య, కాకినాడ పిన్ని, బీరకాయల తాత, శ్రీకాకుళం అమ్మమ్మ, బొబ్బిలి డాక్టరుగారు, కొత్త పేట నాయుడు, వగైరా వగైరా.

భూమి తనలో తాను, సూర్యుని చుట్టూ తిరగడం యెపుడారంభించింది? ఈ అత్తవారి సంసార చక్రం గిర గిరా తిరగడం ఎప్పుడారంభించిం? ఇవి రెండూ యిలా అంతూ పొంతూ లేకుండా యెందుకు తిరుగుతున్నాయి?

ఆమె కివే ఆలోచనలు! ఆలోచనలకి అంతులేదు. ప్రతీ ఆలోచన వెనకా వొక బెంగతో కూడిన అన్వేషణ వుంది.

ఆమె నిశ్చలంగా వుంటుంది. గత మూడు నెలల నుంచీ మరీ బొత్తిగా కదలనేలేదు. ప్రక్కమీదే వుంది.

ఆమె పైకి నిశ్చలంగావున్నా లోన దిద్దిర తిరిగిపోతూంది. పైకి నిశ్శబ్దంగావున్నా ఆమె తలలో ప్రళయ సమయ పర్జన్యాలు గర్జిస్తున్నాయి. ఆమె కొండ కడుపులో తుక తుక వుడికిపోతున్న జ్వాలాముఖి. ఇల్లంతా ధగధగా మెరిసిపోతున్నా, ఆమెమనసులో అమావాశ్య రాత్రి కటిక చీకటి!

ఆమెకి జీవితం మీద ఆశ కలిగించేది వుందా? చెరువులోంచి బైటికి పారవేయబడ్డ తెల్లకలవ పువ్వులా శుష్కించి నశించి పోవడమేనా ఆమె తలరాత! లోతుకుపోయినా తేజోవంతమైన ఆమె విశాలమైన కళ్లు దేన్ని

వెతుక్కుంటూన్నాయి? ఆమె నిత్యం కిటికీలోంచి చూసే ఆ పెరట్లో, పరిమళాలు వెదజల్లే పలురంగుల పూలు, విచ్చే మొక్కలున్నాయి. అందమైన పాదులున్నాయి. కాని ఆమె ఆశగా చూసేది ఆ మోడుతేరిన బాదంచెట్టే.

ఆమె కాపురాని కొచ్చిన మొదట్లో ఆ చెట్టు ఆకులు. కాయలతో పచ్చగా కలకల లాడుతూండేది. కాని చూస్తుండగా ఆరునెలల్లో మోడై పోయింది. తిరిగి చిగిర్చలేదు.

ఆమె భర్త పెద్ద పెద్ద పరీక్షలు ప్యాసయ్యేడు. బలంగా పొడుగ్గా వుంటాడు. చిన్న వుంగారాల జుత్తు. ఎఱ్ఱటి కళ్లు. ఆగర్భ శ్రీమంతులకుండ వలసిన లక్షణాలన్నీ వున్నాయి.

అతనొక పెద్ద కంపెనీలో వుద్యోగి. రెండు వేలు జీతం. అతని స్నేహితులందరూ తెల్ల యేనుగులే. వాళ్ళంతా అతి తరచు వచ్చి వెడుతుంటారు. అందరికీ రాచమర్యాదలు జరుగుతాయి.

అతను 'హైసొసైటీ' వ్యక్తి. సకల గుణాభిరాముడు ఆ వ్యవహారమంతా హుందాగిరీగా చలామణీ అవుతుంది. అతని స్నేహితులందరికీ 'సలితూగే' భార్యలున్నారు. అది తనకు లోపించిందని తరుచు బాధపడతు. ఆ విషయములో తనవంటి వారికి స్వతస్సిద్ధంగా వుండే 'నిర్లక్ష్య భావం' అతనికీ వుంది.

అతనికి ఆమె అంటే యెంతో అభిమానం, జాలి, సానుభూతి అటపా తడపా వచ్చి ఆమె కుశలం భోగట్టా చేస్తుంటాడు. కొండంత విగ్రహంతో వచ్చి పాల బిళ్ళల్లాంటి చెక్కిళ్ళు కాస్త వెనక్కి జరిగేలా చిరునవ్వు నవ్వి ఆమెని నిశ్శబ్దంగా పలకరిస్తాడు. ఆమెకి సర్వ సదుపాయాలు జరుగుతున్నాయో లేదో కనుక్కొంటుంటాడు.

కాని, ఆమె పరిస్థితి నానాటికీ క్షీణించింది.

ఆమెకి వివాహమై కొద్దేళ్ళయింది. మొదట్లో తలిదండ్రులు, అన్నలు తరచు వచ్చేవారు. ఆమె కూడా అప్పుడప్పుడు పుట్టింటికి వెళ్ళేది. కాని రాను రాను రాకపోకలు తగ్గేయి. ఆమెకి మెట్టినింటిలోనే సదుపాయంగా వుంటుంది. ఆ విషయంలో రెండభిప్రాయాలు లేవు. అంతా ఆమెని ఆదరించే వారే. అందరికీ ఆమె అంటే జాలి.

కాని ఆమె కర్పూరంలా హరించి పోతూంది!

ఆరు నెలలై అక్కడే, అలాగే పడుకుంది. కిటికీలోంచి బాదం చెట్టు కేసి చూస్తూంది.

గదిలో ఆమె మంచానికి యెదురుగా గోడవారగా అందమైన పెట్టె వుంది. అప్పుడప్పుడు ఆమె దానివైపు కూడా చూస్తుంది. మొదట్లో దాన్ని చూసినప్పుడల్లా కన్నీరు మున్నీరయేది. ఇప్పుడా హృదయసాగరం యెండిపోయింది.

ఆ సాయంత్రం యేడు గంటలకి ఆమె చెట్టు వేపొకసారి, పెట్టె వేపొకసారి చూసింది. మనసెందుకో ప్రశాంతమైనట్లనిపించి, కళ్ళు మూసుకుంది.

వెంటనే ఆమె మనోనేత్రం తెరుచుకుంది. కలకలలాడుతున్న గున్న బాదం చెట్టు. దానికింద సాధారణమైన వొక చిరుచాప. ఆమె తంబురా శృతిలో కంఠం మేళవించి పాడుతూంది. ఎదురుగా 'గురువుగారు' శాలువ కప్పుకుని కూచున్నారు.

గురువుగారు గొప్ప గాయకులు. విద్వాంసులు. ఆయన పాటకి ప్రకృతి పులకిస్తుంది. సంగీతామృతరుచి పూర్వజన్మ నుండీ రావాలి. ఆ రుచి తెలియని వారు 'సా' అనకూడదు. గాయకుడు అలౌకికానందం పొంది, దాన్ని రసజ్ఞులైన శ్రోతల కందించాలి. ఆ భాగ్యం యెన్నో జన్మల్లో చేసిన తపస్సు ఫలితం. ఇది ఆయన మతం.

పదేళ్ళపాటు అతని కఠిన శిక్షణలో ఆమె నాదోపాసన చేసింది. స్వరగంగాలహరిలో తేలియాడింది. ఆయన రోజూ వచ్చి పాఠం చెప్పే వారు. కాని యేరోజైనా వొంట్లో బాగులేకరాకపోతే తనే స్వయంగా ఆయన పేద కుటీరానికి వెళ్ళేది. ఇంటి ముందు బాదంచెట్టు కింద ఆయన కెదురుగా కూచుని సాధకం చేసేది.

'అమ్మా! నువ్వు గురువుకి కీర్తి తెచ్చే శిష్యురాలివి. అత్తవారింటికి వెడుతున్నావు. నన్ను మరిచిపోయినా నా సంగీతం మర్చిపోకు!

ఆమె కళ్లు చెమర్చేయి. అతనికి వంగి నమస్కరించి లేచి వెనుదిరిగింది. అదే ఆమె ఆనంద విహంగం రెక్కలు తెగనరికిన క్షణం.

తంబురా పెట్టె చూసి అత్తవారింటిలో ఆడామగ అంతా ఆశ్చర్యపోయారు. ఉన్నత విద్య వుట్టి కట్టుకు వూగే ఆ ఇంట్లో ఆ పెట్టె యెవ్వరికీ అర్థం కాలేదు. అది తొలిరోజున యెక్కడ వుంచబడిందో యీ క్షణం కూడా అక్కడే తెరవబడకుండా వుంది. ఆ ఇంట్లో గదికొక రేడియోవుంది. కాని ఒక్కటీ సంగీతం పలకదు. వార్తలు! వార్తలు! ఉపన్యాసాలు! ఆ యిల్లు రస దరిద్రాణుల హెడ్డాఫీసు!

ఆమె బెంగటిల్లి కుంగిపోయింది. డబ్బు, తిండి, బట్ట, రాకపోకలు, దావాలు, రోగాలు, వైద్యులు, పరీక్షలు, ఫస్టు క్లాసులు మొదలైన ప్రాపంచిక విషయాల వుక్కిరి బిక్కిరితో, ఆ యింట్లో శృతిలో కంఠం

చేర్చి, సర్వ సోపానాల మీద మేఘాల ద్వారా, నాదానందలోకానికి పయనించడానికి అవకాశం లేదు. ఇక్కడ తన గుండెలు స్రవించవు. ఇతర హృదయాలను ద్రవింప జెయ్యలేవు. సప్తస్వరాశ్వాల హేషలు. చీకటి తెరలు చించుకుని యెగిరే పక్షుల కలస్వన ఘోషలు కలసి మనస్సాకాశ పథాన్ని కోమల రుణరాగ రంజితం చెయ్యలేవు.

ఆమె మంచం పట్టింది. ఆమెకి వైద్యం ఆరంభమైంది. మందులు! మందులు ఏం లాభం లేక పోయింది. అటు బాదం చెట్టు, ఇటు తంబురా పెట్టె — యివే ఆమె మూగమనసు బాధని కాస్త కనిపెట్టేయి.

క్రమేణా ఆమె పూచికపుల్లయి పోయింది. జుట్టు రాలిపోయింది. వెంట్రుకలు తీసిన కోడిలా అయిపోయింది. బాదం చెట్టు మీంచి గాత్రం — తంబురా పెట్టెలోంచి నిండు శృతి ఆమె హృదయ చక్షువులకి యెల్లవేళలా వినిపిస్తున్నాయి. బహిర్ ప్రపంచమంతా కటిక చీకటి: ఒకటే నిశ్శబ్దం: ఆమె సంగతి యెవ్వరికీ తెలీదు.

సాయంత్రం ఎనిమిదౌతూంది. ఆమె భర్త యెవర్నో తీసుకొచ్చి, యేదో చెప్పి వెళ్ళేడు. ఎలక్ట్రీ దీపం కాంతివంతంగా వెలుగుతున్నా ఆమెకి చూపు ఆనడం లేదు.

కళ్ళ జోడు, తెల్లటి కల్లీ లాల్చీ, షరాయి, చిరునవ్వు అతడు నమస్కరించాడు. ఆమె విశాల నేత్రాలు బాగా విప్పారించి, ప్రయత్నించి తేరి చూసింది.

గతుక్కుమని, కళ్ళొకసారి చిట్లించి మూసుకుంది.

'గురువుగారూ! నాకు నమస్కారం చేస్తున్నారా!' ఆమె నెమ్మదిగా మూలిగినట్టుంది. నేనమ్మా — గురువుగారబ్బాయిని. పనిమీద యీ వూరొచ్చా — '

'ఓహో!' ఆమె కళ్ళు మూసుకునే అంది.

సుడిగుండంలో పడ్డ యెండుటాకులా గిర గిర తిరిగి పోయింది. ఎన్నెన్నో పూర్వజన్మల దట్టమైన స్మృతుల పొరలు కరకర తెగిపోయాయి. ఏవేవో శబ్దాలు, ప్రతి శబ్దాలు హోరెత్తాయి. తిరిగి ఒక్కతృటిలో ప్రశాంతి.

'నేను పాడడం లేదు - నాకు వూపిరితిత్తులలో పుట్టకురుపు మొలిచింది'

అతనివేపు జాలి వుబికే కళ్ళు నిమ్మళంగా తిప్పింది.

'పెద్దవాడవయేవు గురువుగారి లాగేవున్నావు. ఆ తంబురా తీసి వొక పాట పాడు'.

అతను పాడేడు - మృదువుగా - రస తరంగాలు పొంగేయి. ఆమెకు జీవిత బంధాలు ఒక్కసారి చిటపట తెగిపోయినట్టయింది. ఆమె రెండు కళ్లు తుఫానుపట్టిన సముద్రాలయేయి. తరవాత ద్వంద్వాతీతమైన నిశ్చల సమాధి అనుభూతి పొందింది ఆ పవిత్రాత్మ.

ఆ తెల్లవారు ఝామున అటు బాదంచెట్టు యిటు తంబురా పెట్టె దగ్గర మౌనంగా శలవు తీసుకుని ఆమె శాశ్వతంగా కళ్లు మూసింది.